

# ఆపద్ధర్మం

రాయబారపు సంజీవ్ కుమార్

'నిద్ర రావటం లేదు మొర్రోయ్' అంటూ గోల పెడుతున్నా సరే, ఏదో ఓ విధంగా మైమరపించే, భయపెట్టో, మాయమాటలు చెప్పో...పెద్దవాళ్ళు వాళ్ళని బలవంతంగా నిద్రపుచ్చుతుంటారు. రాత్రి సరిగ్గా నిద్రపోకపోతే, ప్రొద్దున్న ఆలస్యంగా లేవాల్సి వస్తుందని, స్కూల్‌కి లేటవుతుందనీ, మంచి పిల్లలు బుద్ధిగా వేళకు పడుకొని, వేళకి నిద్రలేచి తమ పనులు చేసేసుకొంటారని నీతి పాఠం నేర్పేసి, ఉత్తమ తల్లిదండ్రులుగా అవార్డు కొట్టేయాలని ఆరాటపడతారు.

కానీ రేపటి సమస్యల గురించి నిన్ననే ఆలోచించటం మొదలెట్టి, ఈ రోజు కూడా అదే ధ్యానలో కొట్టుమిట్టాడుతూ, మెదడు నిండా సంఘర్షణలతో... ఎంతకూ దొరకని గవర్నమెంట్ ఉద్యోగంలా....నిద్ర పట్టక, ఎంత ప్రయత్నించినా కంటి మీద కునుకే పట్టనప్పుడు.... మరి నాలాంటి నిరుద్యోగి పరిస్థితి ఎలా ఉంటుందో...వేరే ఎక్కువగా చెప్పనక్కరలే దనుకుంటాను.

ఆ రోజు రాత్రి కూడా అదే జరిగింది. ఇన్నేళ్ళొచ్చినా ఇంకా 'సెటిల్' కాలేదేమని సమాజం ప్రశ్నిస్తోందని - నా తల్లిదండ్రులు కూడా ఒక దండకమే చదివారు. భగవద్గీత అయితే రోజూ విన్నా... మరింత స్ఫూర్తినో, సత్య సందేశాన్నో కలుగ చేస్తుంది. మరి ఈ తిట్ల జోలని వినీ వినీ.... ఇంక ఆ రాత్రి నిద్ర పోవద్దని గట్టిగా తీర్మానించుకున్నాను. ఆ రకంగా నన్ను నేను ఒక 'సవాల్'కి జవాబు కనుక్కునేందుకు ప్రేరేపించాననే చెప్పవచ్చు.

నాకు ఊహ తెలిసినప్పటి నుండీ ఇప్పటి వరకూ జరిగిన పరిణామాలు, విజయాలు, వైఫల్యాలు, కారణాలు, నా జీవితాన్ని ప్రభావితం చేసిన వారి పాత్ర, గుణ శీలాలు, అందుపై నా వ్యాఖ్య.... ఇత్యాది ప్రశ్నలన్నీ వేసుకుంటూ 'శోధన' ప్రారంభించాను.

గడ్డివాములో సూది దొరకలేదు. గడియారంలో ముళ్ళు ఐదు గంటలు దాటినట్లు చెప్తున్నాయి.

ఒక చిన్న ప్లాస్టిక్ సంచీలో రెండు పీడియో కసెట్లు, నేను గతంలో పనిచేసిన కాన్వెంట్ వారి తాజా సావనీర్, ఒక లుంగీ సర్దుకొన్నాను.

ఇంటి ముందు మంచి నీటి కోసం కొళాయి వద్ద జనం హడావిడి అప్పుడే మొదలైంది. తెల్లగా తెల్లారి పోయింది - చీకట్లోనే! అమ్మను మెల్లిగా నిద్రలేపి గట్టిగా చెప్పాను - "వరంగల్ వదిలేసి పోతున్నాను - ఏదో ఒకటి సాధించనిదే తిరిగిరాను" అని. సమాధానం వినకుండానే, తలుపులు దగ్గరకు వేసి బయట పడ్డాను.

ఐదూ ముప్పయిలోగా స్టేషన్‌కి చేరగలిగితే 'కాకతీయ' ఎక్స్‌ప్రెస్....నిజానికి ఇప్పుడది 'ఫాస్ట్ ప్యాసింజర్' అయినా - హైద్రాబాదుకి నా ప్రయాణం ఒకే అయిపోతుం దన్నమాట. 'కాకతీయ' రోజూ ఉదయాన్నే బయలుదేరి, కొన్ని పందల మంది ప్రయాణీకుల్ని భాగ్యనగరంలో దింపుతుంది. అదీగాక ప్యాసింజర్ కదా - టికెట్ ధర తక్కువ.

జేబులో నిన్న ఓ మిత్రుడి దగ్గర అడిగి తీసుకొన్న పాతిక రూపాయ లున్నాయి. అంటే హైద్రాబాద్ చేరడానికి సరిపోయే డబ్బుల్తో.... ఏమైతే అది అవుతుందిలే అనే పట్టుదలతో బయలుదేరా నన్న మాట.

ఇంటి నుంచి స్టేషన్‌కి పదిహేను నిముషాల కాలినడక. టైం చూశాను

వ్యవధి ఎక్కువగా లేదు. నడుస్తూ ఆలోచిస్తున్నాను. నిన్న ఎంత ప్రయత్నించినా అంతకు మించి అప్పు చేయలేక పోయాను. ఇంటర్ తరువాత నుంచీ ఏడెనిమిదేళ్ళుగా అక్కడా ఇక్కడా ప్రైవేట్ స్కూళ్ళల్లో ఉద్యోగం చేసినా, స్వతహాగా కొన్ని ఆశయాలు, సమాజానికి మేలు చేయాలనే ఆదర్శ భావాలూ లాంటి లక్షణాల కారణంగా... ఎక్కడా ఎక్కువ కాలం నిలదొక్కుకోలేక పోయాను.

చాలీ చాలని జీతం డబ్బులు ఏ పత్రికలకో, సినిమాలకో ఖర్చయిపోవటం తప్ప వెనకేసుకొన్నదేమీ లేదు. సొంతంగా ఒక చక్కని, వ్యాపార ధోరణికి తక్కువ ప్రాధాన్యం ఇస్తూ, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దగలిగే విధానాలతో మంచి పాఠశాల నెలకొల్పాలని అనుకుంటూనే ఉన్నా... కానీ ఏవో అనుకోని వైపరీత్యాలు జరగడం, ఆ బృహత్ కార్యం వాయిదా వేయడం... జరుగుతూ వచ్చింది.

కానీ ఈ విద్యా సంవత్సరంలో... ఒక పాఠశాల మేనేజ్‌మెంట్ అసంబద్ధ విధానాలను వ్యతిరేకిస్తూ రాజీనామా చేసి మధ్యలోనే బయటకు రావడం, మరో ఉద్యోగం దొరక్క పోవడంతోనే కష్టాలు దాడి చేయడం మొదలైంది.

ఫర్లాంగు దూరంలో ఉండగానే, కాకతీయ వెళ్ళిపోతుండడం కంటపడింది.

ఇప్పుడెలా? హైద్రాబాదులో తెలిసిన మిత్రులు ఓ పదిమంది వరకూ ఉన్నారు. ఎవరో ఒకరు, ఏదో ఓ మార్గంలో సహాయ పడకపోతారా అన్న ధీమా ఉంది.

వెళ్ళిపోతున్న రైలు బండిని నిరాశగా చూడసాగేను కనుమరుగయ్యే దాకా. కానీ తిరిగి ఇంటికి వెళ్ళదలచుకోలేదు. కానీ ఎలా? మళ్ళీ అదే ప్రశ్న! అప్పు చేసి మరో పదిహేనో ఇరవయ్యో కలిపితే గానీ తరువాత బండిలో వెళ్ళలేను.

హైద్రాబాద్‌లో పగటి పూటే కలుసుకోవాలి ఎవరినయినా కలవాలంటే. రాత్రయితే - గూడు, సమస్య వచ్చి పడుతుంది. అందుకే.... తీవ్రంగా ఆలోచించసాగాను.

మెరుపులా స్ఫురించాడు గురుమూర్తి. భద్రాచలం రోడ్‌వైపు వెళ్ళే బళ్ళకి టికెట్లు ఇచ్చే కౌంటర్‌లో కనిపించాడు. కౌంటర్ కున్న చేయి దూర్చే సందుకి అటూ ఇటూ కొద్దిగా నన్నని తీగల లోంచి, తల వంచుతూ పలకరించాను.

గురుమూర్తి కొద్దిగా ఆశ్చర్యంగా 'గుడ్‌మార్నింగ్' చెప్పేడు.

నేను ఆ మధ్య ఓ నాలుగేళ్ళు వర్క్ చేసిన స్కూల్‌లో గురుమూర్తి పిల్లలు చదువుకుంటున్నారు. అప్పటి నుంచే అతనికి నేను తెలుసు. అంటే దాదాపు ఎనిమిదేళ్ళ పరిచయం.

స్కూలుకి ఫీజులు కట్టడానికో, ఫంక్షన్లకో వస్తూండేవాడు. నేను కూడా ఆ ప్రిన్సిపాల్ ఏదైనా ఊరెళ్ళడానికి, కావలసినప్పుడల్లా టికెట్ బుకింగ్‌కో, రిజర్వేషన్ వగైరా విషయాల కొరకో వెళ్తూ ఉండేవాడినే తప్ప, నా పర్సనల్ విషయాలలో అతని సహాయం ఎప్పుడూ తీసుకోలేదు. ఆ అవసరమూ రాలేదు.

అయితే గురుమూర్తి పిల్లలు ముగ్గురూ నాకు బాగా తెలుసు. ఆ స్కూల్ దాదాపు స్థాపించినప్పటి నుండీ కొన్ని సంవత్సరాలు సర్వీస్ చేయడం వల్ల తల్లి దండ్రులూ, విద్యార్థులు బాగానే పరిచయం ఉండేది.

"ఏమిటి సంగతి?" అడిగాడు గురుమూర్తి అదోలా.

తెల్లవార్లూ ఒక్క నిముషం కూడా కనురెప్ప వాల్చక, ఆకలితో నీరసించి, ఆలోచనలతో అలసి పోయిన నా గెటప్‌ని బట్టి - ఏమనుకుని ఉంటాడో ఊహించగలిగేను. పొద్దున్నే మందుకొట్టి ఉంటాడని కచ్చితంగా అనుకొని ఉంటాడు. కానీ అతనికీ, నాకూ అంత సాన్నిహిత్యం లేదే!

ముక్కూ మొహం తెలీని వాణ్ని సహాయం అడగటం 'యాచన' అవుతుంది. కానీ ఇన్నేళ్ళ

పరిచయం ఉన్న గురుమూర్తిని నా క్కావలసిన సహాయం అడగటానికి సంకోచించలేదు నేను.

"మీ డ్యూటీ ఎప్పటి దాకా సర్?" అని ప్రశ్నించేను.

"ఎనిమిది వరకు" అన్నాడు. గడియారంలో ఏడు కావస్తోంది. అప్పటి వరకూ ఆలోచనల్లో అటూ ఇటూ తిరగడం వల్ల టైం తెలియలేదు.

"అయితే ఓ గంట వెయిట్ చేస్తాను... మీతో ఓ కప్పు కాఫీ తాగాలనుంది" అన్నాను.

"బయటకొస్తారు కదా!"

"లేదు... ఇప్పుడే త్రాగాను."

గురుమూర్తి వైఖరి అర్థమైంది నాకు.

"అహ....ఫరవాలేదు... కనీసం కంపెనీ అయినా ఇస్తారు కదా!" అన్నాను.

"నా తరువాత రావాల్సిన నా కొలీగ్ రాలేదు. బహుశా నేను ఈ కౌంటర్ కంటిన్యూ చేయాల్సి ఉంటుంది" అన్నాడు.

కర్టసీ లేని గురుమూర్తిని సరిగ్గా అవగాహన చేసుకొంటున్నానో లేదో అనుకొన్నాను కొంచెం ధైర్యం తెచ్చుకుంటూ.

"అది సరే... చెప్పండి ఏమిటి సంగతి?" అన్నాడు గురుమూర్తి - నా చేతిలో కవరు వంక పరిశీలనగా చూస్తూ.

"మీరు కౌంటర్‌లో డ్యూటీలో ఉన్నారు. నా కో చిన్న సమస్య వచ్చి పడింది. కానీ చెప్పక తప్పదు. అయినా మీరు తలచుకొంటే - పది నిముషాలు బయటకు వచ్చి ఆ సహాయం చేయగలరు, అదేమంత అసాధ్యం కూడా కాదు" అన్నాను.

"మరేం ఫరవాలేదు - కానివ్వండి" అన్నాడు గురుమూర్తి.

"ఈ కవర్లో వీడియో కేసెట్లున్నాయి. ఒకటి మొన్న స్కూల్ పిల్లలతో కలసి దూరదర్శన్‌లో ఇచ్చిన నృత్య కార్యక్రమం. అందులో మీ అబ్బాయి ఉన్నాడు కూడా. మరొకటి పాత ప్రోగ్రాం కేసెట్" అని చెప్పాను.

"అఁ అఁ... మా అబ్బాయి ఉన్న ప్రోగ్రాం కేసెట్టా? మీరు ఆ స్కూల్‌లో పని చేయటం లేదు కదా? మరి మీ దగ్గర ఆ కేసెట్ దేనికి?"

"సర్... నిజమే. అక్కడ పని చేయటం లేదు. వివరాలన్నీ చెప్తాను. కానీ ఎక్కువ టైం లేదు. నేను మరో బండికి హైద్రాబాద్ వెళ్ళాలి. మీరు నాక్కాస్త సాయం చేస్తారని వచ్చాను." ఉన్న విషయం చెప్పాను.

"దొరకవు" అన్నాడు అదే చిర్నవ్వుతో మూర్తి. అది ఎదుటి మనిషిని హేళనగా, చిన్న చూపుతో సరదా పట్టిస్తున్నట్లుంది.

నేను కూలిపోయే స్థితిలో ఉన్నాను. నా నిద్ర లేమి, అలసటకి తోడు ఈ అవమానం.... అన్నీ కలసి నన్ను పాతాళానికితోస్తున్నాయి.

"అదేమి సార్! నన్ను తక్కువగా అంచనా వేస్తున్నట్లున్నారు. ఈ కేసెట్స్ సహాయంతో నా ఎబిలిటీ చూపించి హైద్రాబాద్‌లో ప్రోగ్రాం లేవైనా తయారు చేసుకోవడానికి వెళ్తున్నాను. ప్యాసెంజర్ మిస్సయింది. ఈ చిన్న సహాయం మీరు చేయలేరా?" అని ఉక్రోషంగానో, నిరాశగానో అనగలిగాను.

"మీరు ప్రోగ్రాంలు చేయడమేమిటి?"

"ఆ స్కూలు తరపున ఇప్పటికి ఎన్నో ప్రోగ్రాంలు వ్రాశాను. సంగీతం కూడా కూర్చాను సర్! మీకు తెలీదా? మొన్న కూడా రికార్డింగ్‌కి వెళ్ళే ముందు కలిసినప్పుడు - నాతో మాట్లాడారుగా?"


"నే నే... నాకు మీరు రైటరని తెలీదు. కేవలం టీచరనే అనుకున్నా" అని కొంత విస్మయం ప్రకటించాడు మూర్తి.

సమయానికి నా దగ్గర కలెక్షన్ ఏదీ లేదు కదా, లెటర్ హెడ్ పేజీ ఒకటి చూపించాను.

కౌంటర్లో ఎక్కువగా రష్ లేదు. అడపాదడపా ఒకరిద్దరు వచ్చి టిక్కెట్లు కొనుక్కొని వెళ్ళి పోతున్నారు. నేను తల వంచి మాట్లాడుతూనే ఉన్నాను.

గురుమూర్తి ఏదో రిజిస్టర్‌లో ఏదో వ్రాస్తున్నట్లుగా ఉండిపోయాడు. అప్పటిదాకా ఇంగ్లీషు భాషలో నాలుగైదు పదాలే వాడినా - ఇక పూర్తిగా వచ్చినంత మేర భాషా ప్రయోగం చేశాను. ఎంతయినా - పదేళ్ల నుంచీ పిల్లలకి అన్ని సబ్జెక్టుల్లోనూ పాఠాలు చెప్పాను గదా!

కాసేపు నా మాటలు విన్నాక - 'కౌంటర్‌లో ఉన్నా కదా' అన్నాడు మళ్ళీ.



గురుమూర్తి అసలు స్వరూపం బయట పడుతోంది. బయటి కేంటీన్లు, బుక్‌షాప్స్, ఇతర పరిచయస్థులు ఎందరుండరు? కొన్నేళ్ళుగా అక్కడ తను ఎంప్లాయీ, ఈ చిన్న మొత్తం ఇవ్వడానికి లేదా ఇప్పించడానికి ఏ మాత్రం అనక్తి చూపెట్టని గురుమూర్తిని నే నేమనాలో అర్థం కాలేదు.

కొన్నేళ్ళు అతని పిల్లల్ని స్కూల్లో కొంచెం ప్రత్యేక శ్రద్ధతోనే చూశాను. అయితే ఇలా డబ్బులు అడుక్కొందామని మాత్రం కాదు. మనిషి సంఘజీవి. అవసరా లుంటాయి కదా అనే తప్ప మరో ఉద్దేశ్యం లేదు.

కానీ నేడు? అన్నట్లు.... గురుమూర్తి నేను బాధపడుతున్న విషయాన్ని గమనించినట్లుగా - "మొన్నటి ప్రోగ్రాంకి ఎంత ఖర్చయింది, లాభం ఎంత వచ్చింది?" వగైరా విషయాలు నింపాదిగా అడగసాగేడు.

అతనికి రుచికరమైన విషయాలు - అప్రస్తుతమైనా కొంత వరకు చెప్పేను. ఓపిక నశిస్తోంది. ఆకలిని మించిన నిద్ర, అవమానభారం, అశక్తి 'అణువణువు ఛిద్రమై పోతున్నాను.

"మీ ఈ పద్ధతి వల్ల ఈ రోజు ఒక నమ్మకం తెగిపోయింది" అన్నాను ఇంగ్లీషులోనే.

"మీ రెలాగైనా అనుకోండి." అంతేకానీ అతనిలో కొంచెం కూడా ఇతర భావమేదీ పలకలేదు.

నేను అటూ ఇటూ ఊగుతున్న తీరుని బట్టి గురుమూర్తి ఆ మాట అననే అన్నాడు "ఇలాగే ఒకతను వచ్చి అడిగాడోసారి రచయితనంటూ....."

గురుమూర్తి భావం అదేనా?

"అడుక్కునే వాళ్ళు" అంటూ నీచంగా మాట్లాడే ప్రభుత్వ ఎంప్లాయీస్, ఎగ్జిక్యూటివ్‌లు... రైళ్ళలో, బస్సుల్లో, జర్నీల్లో కాలక్షేప కబుర్లతో ఇలాంటి సంఘటనలను ఉదహరించి - తమ 'ఉదాత్తత'ని హుందాగా ప్రకటించు కొంటుంటారు.

నిజానికి వీళ్లలో చాలా మంది తమ పిసినారి తనం లక్షణాన్ని కప్పిపుచ్చుకోడానికే ఈ 'నిరాకరణ' పద్ధతిని పాటిస్తా రనిపించింది.

భారత దేశం నగటు పౌరుని మీద ఎంత అప్పు ఉందో తెలియని దెవరికి? అడుకోవటం... అంటే... అప్పు చేయడం - అడుకోవటం రెండూ ఒకటే అయ్యాయా?

నేను కదిలాను - కసిగా ఎన్నో అనాలనుంది. కానీ ఏ పాయింటు మీద అనగలను? కనీసం కొన్ని సంవత్సరాలు నీ పిల్లలు నా కనుచూపు మేరల్లోనే ఉన్నారని గుర్తు చేయనా? చదువులో ఎలా ఉన్నారు? ఏ పద్ధతుల్లో చెపితే వారికి అర్థం అవుతుందో వివరించిన విషయం నాకు గుర్తుందని చెప్పనా? ఆ స్కూల్ మేనేజ్‌మెంట్ ధోరణి, వ్యాపార సంబంధమైన వివరాలు చెప్పి మేనేజ్‌మెంట్ పరువుకి నష్టం వాటిల్లజేశానే అని ఇప్పుడు బాధపడుతున్నాను కదా అని అరవనా?

అయినా అతడు నాకు అప్పు ఇవ్వడం లేదా ఇవ్వకపోవడం ... అతనిఇష్టానిష్టాలపై ఆధారపడి ఉంటాయి అనుకుందాం. అలా అయితే ఒక టీచరు ఒక స్టూడెంటుని ఏ వైపుకంటే ఆ వైపు అతని సైకాలజీపైనే ప్రభావం చూపగలడు - తలచుకుంటే. బోడి ఇరవయ్యైదు రూపాయలు... ఒక వేళ నేను తిరిగి ఇవ్వలేదే అనుకో... అప్పుడు కేవలం ఒక వ్యక్తితో సంబంధాన్ని అతడు కోల్పోవలసి వచ్చేది. అంతేగా! లేదూ - తిరిగి ఇచ్చానే అనుకో - నా వల్ల ఎప్పుడో ఏదో ఒక గొప్ప సహాయం తప్పక లభించేది.

భారంగా అడుగులు వేస్తూ, దాదాపు స్పృహ తప్పుతున్న స్థితిలో - గురుమూర్తితో మాట మాత్రం కూడా అనకుండా - స్టేషన్ బయటకు వచ్చాను.

ప్రైవేట్ స్కూళ్ళల్లో తల్లి దండ్రుల సమస్యలపై ఒక గొప్ప ప్రోగ్రాం చేయాలనుకున్న నాకు, ఇప్పుడు ఎందుకో ఆ భావమే లేదు. ఇంతలో ఎవరో పరిచయం ఉన్న వ్యక్తి... బహుశా పేరెంటే.... ఎదురుగా వస్తున్నాడు... చూసీ చూడనట్లు వెళుతున్నది తన్కొక్కడే కాదు.....నేను కూడా!

అయితే చివరగా ఒక్క మాట చెప్పాలి. అదే రోజు... ఇంటర్ చేస్తూ సెలవులకి ఇంటికి వచ్చిన అరుణ్ అనే అదే స్కూలు స్టూడెంట్ ఇంటికి వెళ్లాను. విషయం నిర్మొహమాటంగా చెప్పాను.

ఒక ఉపాధ్యాయుడు ఒక శిష్యుడిని అప్పు అడగవచ్చా? ఈ విషయం ఎక్కడయినా వ్రాసి ఉందో లేదో, ఎవరైనా పెద్దవాళ్ళు అన్నారో లేదో, విన్నారో లేదో.....కానీ.... నాపై కృతజ్ఞత లేకపోతే, అరుణ్ ఎవరో మిత్రుని దగ్గర అప్పు చేసి తెచ్చి మరీ ఇచ్చేవాడా ఆ రోజు నా క్కావలసిన డబ్బు?

★